క్లుప్తంగా...

బీడీఎల్‌లో మెగా మెడికల్ క్యాంపు



మెడికల్ క్యాంపులో పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీడీఎల్ అధికారులు

సంతోష్‌నగర్: కంచన్‌బాగ్‌లోని భారత డైనమిక్ లిమిటెడ్ (బీడీఎల్)లో సీఎస్ఆర్‌లో భాగంగా ఆదివారం మెగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్యాంపును ప్రారంభించారు. ఈ క్యాంపులో పాల్గొన్న స్థానిక ప్రాంతాలకు చెందిన ప్రజలకు సాధారణ వైద్య సేవలు, టీకాలు వేయడంతో పాటు అవసరమైన రోగులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కమోడర్ ఎ.మాధవ రావు, బీడీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.శ్రీనివాసులు, సత్యానారాయణ, సేవా భారతి సీనియర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య సంస్థ కళాకృతి నాట్యాలయ 10వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఆదాయపన్నుల శాఖ కమిషనర్ జీవన్‌లాల్ లగిడియా శాస్త్రీయ సాంప్రదాయ కళలైన కూచిపూడి, భరతనాట్యం వంటి నృత్యాలతో పాటు ఇతర కళలను చిన్నారులకు నేర్పించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం ప్రముఖ నృత్య గురువులు అనురాధ, రాజలకు కళాకృతి ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. అంతకు ముందు సంస్థ చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళాకృష్ణ, సంస్థ వ్యవస్థాపకురాలు భారతి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కచేరి



కీర్తనలను ఆలపిస్తున్న ప్రముఖ గాయని పద్మావతి త్యాగరాజు తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రముఖ సంగీత గురువు పి.పద్మావతి ఆధ్వర్యంలో విష్ణుసేవా పల్లకీ ప్రబంధం పేరిట ఆదివారం రవీంద్రభారతిలో నిర్వహించిన సంగీత కచేరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ.. సంగీతం జీవనోత్సవాన్ని నింపుతుందన్నారు. అనంతరం సంగీత కళాకారులను అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమం భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, పద్మశ్రీ అన్నవరపు రామస్వామి అయ్యగారి శ్యామ్‌సుందరం తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ శాంతి కోసం అగ్ర అఖండ జ్యోతి రథయాత్ర



రథయాత్రకు స్వాగతం పలుకుతున్న పంకజ్‌కుమార్ అగర్వాల్

చార్మినార్: ప్రపంచ శాంతి కోసం అగ్ర అఖండ జ్యోతి రథయాత్ర నిర్వహించడం సంతోషకరమని నార్‌నూల్ అగర్వాల్ సమితి ప్రతినిధులు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. పాతబస్తీ ఘాన్సీబజార్ రికాబ్‌గంజ్‌లో నిర్వహించిన రథయాత్రకు ఆయన పూజలు నిర్వహించి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు రవీందర్ అగర్వాల్, రాజేష్ అగర్వాల్, సరితా అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రెజ్లర్‌కు అభినందన

మణికొండ: హరియాణాలో జరిగిన జాతీయ స్థాయి గ్రాప్లింగ్ చాంపియన్ షిప్–2023లో నార్సింగికి చెందిన మణికాంత్‌యాదవ్ బంగారు పతకాన్ని సాధించారు. ఈ పోటీలలో పాల్గొని ఆదివారం నార్సింగికి చేరుకున్న విషయం తెలుసుకుని నార్సింగి మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అశోక్‌యాదవ్, రెజ్లర్ మణికాంత్‌యాదవ్‌తో పాటు కోచ్ శ్రీకాంత్‌యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. నార్సింగి నుంచి జాతీయస్థాయి పోటీలలో పాల్గొనడంతో పాటు మూడు పతకాలను సాధించడం దేశానికి గర్వకారణమన్నారు. నాయకులు వెంకటేష్ముదిరాజ్ తదితరులున్నారు.

పర్యాటకుల సందడి



చార్మినార్ రోడ్డులో సందర్శకుల సందడి

చార్మినార్: వీకెండైన ఆదివారం పాతబస్తీలో సందర్శకుల సందడి నెలకొంది. బాటిల్ నెక్ రోడ్డులు కావడంతో సందర్శకులకు ట్రాఫిక్ తిప్పలు తప్పలేదు. విధినిర్వహణలో ట్రాఫిక్ పోలీసులు ఉన్నప్పటికీ.. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ జరగలేదు. దీంతో పర్యాటకులు పడరాని పాట్లు పడ్డారు. ఆదివారం కావడంతో ఎటు చూసినా సందర్శకులు సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాతబస్తీలోని పర్యాటక స్థలాలు సందర్శకులతో కళకళలాడాయి. పాఠశాల విద్యార్థులకు ఆదివారం సెలవు కావడంతో తమ కుటుంబసభ్యులతో కలిసి పాతబస్తీలోని చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, జూ పార్కు, నిజాం మ్యూజియం, మక్కా మసీదులను సందర్శించి కాలక్షేపం చేశారు. సెల్ఫీలు దిగి సరదాగా గడిపారు. చిరు వ్యాపారాలు సైతం జోరుగా కొనసాగాయి. పర్యాటకుల రద్దీ పెరగడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. గుల్జార్‌హౌజ్ ఫౌంటేన్ వద్ద యథావిధిగా ట్రాఫిక్ జాం తప్పలేదు.

'కోట'కిటకిట..

గోల్కొండ: గోల్కొండ కోట, కుతుబ్‌షాహీ రాజుల సమాధుల ప్రాంగణమైన సెవెన్ టూమ్స్ ఆదివారం సందర్శకులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే గోల్కొండ కోటకు వివిధ ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. పర్యాటకులతో గోల్కొండ కోట బాలహిసార్ ద్వారం జనసంద్రంగా మారింది. ఇక్కడ ఉన్న భారీ ఫిరంగి, క్లాపింగ్ యంత్రం చూడడానికి పర్యాటకులు పోటీపడ్డారు. బాలహిసార్ ద్వారంపైన ఉన్న యంత్రం కిందిభాగంలో చప్పట్లు చేస్తే కోటపైన కొలువుదీరే రాజుకు ఆ చప్పట్ల మోత వినిపించేదని చరిత్రలో ఉంది. క్లాపింగ్ పోర్టిపో వద్ద పర్యాటకులు చప్పట్లు చేస్తూ ముచ్చటపడ్డారు. రాణి మహల్, అక్కన్నమాదన్న కార్యాలయ భవనాలను పర్యాటకులు ఎంతో ఆసక్తిగా తిలకించారు.



కార్వాన్‌లో మిత్రకృష్ణ విజయం ఖాయం



సర్టిఫికెట్లను ఇస్తున్న ఎమ్మెల్సీ ప్రభాకర్, కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ

జియాగూడ: కార్వాన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ అసెంబ్లీ ఎన్నికల్లో అఖండ విజయం సాధిస్తారని ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ అన్నారు. ఆదివారం జియాగూడలో గల భారత అభ్యుదయ ఉన్నత పాఠశాలలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల ఒక్కరోజు శిక్షణ శిబిరం కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ ఆధ్వర్యంలో ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ట్రెనింగ్ క్యాంపు ద్వారా సుమారు 500 మంది కార్యకర్తలకు శిక్షణ శిబిరాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రభాకర్ ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు నేరుగా అందుతున్నాయన్నారు. కార్వాన్ నియోజకవర్గం నుంచి దళితుడైన మిత్రకృష్ణకు సీఎం కేసీఆర్ టికెట్ కేటాయించి కార్వాన్‌లో బీఆర్ఎస్ గెలుపునకు బాటవేశారన్నారు. మతతత్వ పార్టీలకు ఈసారి కార్వాన్ ప్రజలు బీఆర్ఎస్‌ను గెలిపించి గట్టి బుద్ధి చెబుతారన్నారు. కేటీఆర్ పిలుపు మేరకు తెలంగాణలో మొదటిసారి జియాగూడలో కార్యకర్తలకు శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం కార్వాన్ బీఆర్ఎస్ అభ్యర్థి మిత్రకృష్ణ మాట్లాడుతూ... కార్వాన్ ప్రజలకు 45 ఏళ్ల నుంచి కార్వాన్ ప్రజలకు అందుబాటులో ఉంటున్నానని దీర్ఘకాలంగా నెలకొన్న సమస్యలతో పాటు విద్య, వైద్య కుటీర పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కావూరి వెంకటేష్, అడ్‌హాక్ కమిటీ సభ్యుడు శేఖర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నర్మద, అసెంబ్లీ యూత్ నాయకుడు మిత్ర అభిషేక్ డివిజన్ అధ్యక్షుడు నరహరిచారి, సీనియర్ నాయకులు శ్రీనివాస్ గుప్తా, సి.బాబు, అరుణ్‌కుమార్, సందీప్‌లాల్ యాదవ్, అసెంబ్లీ యూత్ అధ్యక్షుడు కిశోర్ కుమార్, ఉమేష్, విజయ్ ముదిరాజ్, చిరురాజ్ పాల్గొన్నారు.



శిక్షణ పొందిన కార్యకర్తలతో ఎమ్మెల్సీ ప్రభాకర్, మిత్రకృష్ణ

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం



సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో ఛత్రినాక ఏసీపీ రమేశ్, గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

గౌలిపురా: గౌలిపురా డివిజన్ హనుమాన్‌నగర్ ఫేజ్–1లో శ్రీ హనుమాన్‌నగర్ యువజన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బస్తీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఆదివారం ఛత్రినాక ఏసీపీ జి.రమేశ్, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏసీపీ రమేశ్ మాట్లాడుతూ... నేరాలను నివారణకు సీసీ కెమెరాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. ప్రతిఒక్కరూ తమ తమ బస్తీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే బస్తీల్లో ఎలాంటి నేరాలు జరిగినా వాటిని వెంటనే ఛేదించేందుకు సీసీ కెమెరాలు ఉపయోపడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్రినాక డీఐ శివ శంకర్, ఎస్సై, శ్రీకాంత్, అధ్యక్షులు పరశురాం, ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి ఆర్.కృష్ణా రావు, సెక్రటరీ పోలోజు సంతోష్ కుమార్, ఆనందేసి విక్రం, వైస్ ప్రెసిడెంట్ కె.పరశురాం, మాజీ అధ్యక్షులు ఆకుల శ్రీరాములు, శ్రీనివాస్ రావు, రవి కిశోర్, రాజేందర్‌యాదవ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

సునీల్ బన్సాల్‌ను కలిసిన బీజేపీ నాయకులు



బయోడేటాను అందజేస్తున్న రఘునందన్ యాదవ్, వనమాల గోపాల్ తదితరులు

అబిడ్స్: బీజేపీ జాతీయ ఆర్గనైజేషన్ కార్యదర్శి, రాష్ట్ర బీజేపీ ఇన్‌చార్జి సునీల్ బన్సాల్‌ను గోషామహల్ బీజేపీ టికెట్ కోసం బీజేపీ నాయకులు కలిశారు. గోల్కొండ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి రఘునందన్‌యాదవ్ తన బయోడేటాను సునీల్ బన్సాల్‌కు అందజేశారు. దాదాపు 35 ఏళ్లకు పైగా బీజేపీలో క్రమశిక్షణ గల కార్యకర్తగా ఉంటూ పలు పదవులలో బాధ్యతాయుతంగా పనిచేశానన్నారు. నియోజకవర్గంలో సీనియర్‌నైన తనకు టికెట్ ఇస్తే అన్నివర్గాల మద్దతుతో బీజేపీ జెండా ఎగరవేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనమాల గోపాల్, దయానంద్‌యాదవ్, ముఖేస్ సోని, రమేష్ వ్యాకర్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఓయో రూమ్‌లో వ్యభిచారం

నాంపల్లి: ఓయో రూమ్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని మధ్య మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు, రూ.2,200 నగదు, ఒక ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్‌కు చెందిన నిర్వాహకుడు సలావుద్దీన్ కస్టమర్లను ఆన్‌లైన్‌లో ఆకర్షించి అనంతరం వారిని యువతులతో మాట్లాడించి వ్యభిచారం నిర్వహిస్తున్నాడు. కాగా మలక్‌పేట్‌కు చెందిన కస్టమర్ ఇర్ఫాన్ ఖాన్‌తో డీల్ మాట్లాడుకుని లక్డీకాపూల్‌లోని హోటల్ మెరీడియన్ ఆర్చిడ్‌లోని ఓయో రూమ్‌కు వచ్చారు. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు హోటల్‌పై దాడి చేశారు. ఇద్దరు విటులతో పాటుగా ఇద్దరు యువతులను పట్టుకుని నాంపల్లి శాంతిభద్రల పోలీసులకు అప్పగించారు. డీసీపీ (ఓఎస్‌డీ) రాధా కిషన్‌రావు ఆదేశాలతో జరిపిన దాడుల్లో ఇన్‌స్పెక్టర్ బి.రాజు నాయక్, ఎస్సైలు సాయి కిరణ్, సీహెచ్ నవీన్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన యానిమల్ కీపర్ షాబాజ్ అంత్యక్రియలు



షాబాజ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జూపార్కు అధికారులు

బహదూర్‌పురా: జూపార్కులో ఏనుగు దాడిలో మృతి చెందిన యానిమల్ కీపర్ షాబాజ్ అంత్యక్రియలు ఆదివారం పూర్తయ్యాయి. జూపార్కు, అటవీ శాఖకు చెందిన ఉన్నతాధికారులు మృతిడి నివాసానికి వెళ్లి పుష్పగుచ్ఛాన్ని ఉంచి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబసభ్యులతో మాట్లాడి ఓదార్చారు. ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆర్.ఎం.డోబ్రియాల్‌తో పాటు ప్రిన్సిపాల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (వైల్డ్ లైఫ్) లోకేశ్ జైశ్వాల్, రాష్ట్ర జూపార్కుల డైరెక్టర్ వీఎస్ఎన్వీ ప్రసాద్, జూపార్కు క్యూరేటర్ ఎ.నాగమణి, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) డాక్టర్ ఎం.ఎ.హకీం తదితరులు పాల్గొని నివాళులర్పించారు. రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం తరఫున రావాల్సిన అన్ని సౌకర్యాలను ఇప్పిస్తామని.. కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. బహదూర్‌పురా ఎమ్మెల్యే మౌజం ఖాన్, స్థానిక కార్పొరేటర్లు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్ట్

గన్‌ఫౌండ్రీ: యాపిల్ ఫోన్ నకిలీ ఉత్పత్తులను విక్రయిస్తున్న నాలుగు మొబైల్ షాపులపై పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. సెంట్రల్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం జగదీష్‌మార్కెట్‌లోని పలు మొబైల్ షాపులలో నకిలీ ఉత్పత్తులపై సోదాలు నిర్వహించారు. ఈ క్రమంలో జగదీశ్‌మార్కెట్‌లోని జై రాజేశ్వర్ మొబైల్స్, న్యూ కలెక్షన్ మొబైల్స్, పీఎస్ సెలికాన్ మొబైల్స్, త్రినిటి మొబైల్ షాపులలో పెద్ద ఎత్తున యాపిల్ ఫోన్ నకిలీ ఉత్పత్తులను గుర్తించారు. వారి వద్ద నుంచి వాటిని స్వాధీనం చేసుకుని పూర్తి దర్యాప్తు కోసం నిందితులను స్థానిక అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు అబిడ్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీపుర గంగపుత్ర సంఘం ఎన్నికల్లో లక్ష్మణ్ విజయం

యాకుత్‌పురా: పాతబస్తీ సుల్తాన్‌షాహీ గాంధీపుర గంగపుత్ర సంఘం ఎన్నికల్లో పల్లెల లక్ష్మణ్ 487 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఆరేళ్ల అనంతరం గాంధీపురా గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్ష పదవీకి నలుగురు పోటీ చేయగా..పల్లెల లక్ష్మణ్ 487 ఓట్లు సాధించి భారీ మెజార్టీతో విజయం సాధించారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించిన సంఘం ఎన్నికల్లో మొత్తం 730 మంది ఓటర్లు ఉండగా... 530 ఓటర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారని ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన పెద్దలు మోకాలు లక్ష్మీనారాయణ, బాధ రమేష్‌లు తెలిపారు. ఈ ఎన్నికల్లో పల్లెలు లక్ష్మణ్‌కు 487 ఓట్లు రాగా.. గాంద్ర కృష్ణమూర్తికి 15 ఓట్లు, చర్మాణి విజయ్ కుమార్‌కు 14 ఓట్లు రాగా.. బాలక్‌దాస్‌కు 10 ఓట్లు రాగా.. 4 ఓట్లు చెల్లనివి ఉన్నాయన్నారు. విజయం సాధించిన లక్ష్మణ్‌కు శుభాకాంక్షలు తెలియజేసి సంఘం సభ్యులు బస్తీల్లో ఊరేగించారు. ఈ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ కార్పొరేటర్ పాశం సురేందర్‌తో పాటు సంఘం పెద్దలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎన్నికల్లో గెలుపొందిన లక్ష్మణ్‌ను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు

పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేస్తాం



మంత్రి తలసానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్, నందుకుమార్

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గంలో పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తిచేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఉన్న పెండింగ్ పనులు, ఇతర సమస్యలను మంత్రి తలసానికి గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు ముమ్మరంగా పర్యటించి అర్హులైనవారందరికీ ప్రభుత్వ పథకాలు అందించాలన్నారు. బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. అన్ని పథకాలు ప్రతి బస్తీల్లో, మురికివాడల్లో అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. డబుల్ బెడ్‌రూమ్‌ల పంపిణీ, కల్యాణలక్ష్మి, బీసీ బంధు, దళితబంధు లాంటి పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన హకీంపేట్‌లోని కమ్యూనిటీహాల్‌లో షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన వారు దరకాస్తు చేసుకుంటే వారికి తప్పకుండా చెక్కులు అందుతాయన్నారు. అయితే దరఖాస్తులో పొందుపరిచిన అన్ని రకాల ధ్రువపత్రాలు జతచేయడమే కాకుండా సరైన పద్ధతిలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన హకీంపేట్‌లోని హరిజన కమ్యూనిటీహాల్‌లో జరిగిన కార్యక్రమంలో బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు జబ్బార్, మజీద్ తదితరులున్నారు.

'రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం'



మాట్లాడుతూ బీజేపీ నాయకుడు అమర్‌సింగ్

విజయనగర్ కాలనీ: రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని కార్వాన్ నియోజకవర్గం ఇన్‌చార్జి టి.అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం కార్వాన్ శ్రీ దర్బార్ మైసమ్మ ఆలయం వద్ద శౌర్య జాగరణ్ యాత్రకు ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీకి సంబంధించిన వివిధ విభాగాలు ఎంతో పటిష్టంగా పని చేస్తున్నాయన్నారు. ప్రధాని మోదీ విజయాలను ప్రజలకు తెలియజేయడంలో బీజేపీకి చెందిన మోర్చాల నాయకులు, కార్యకర్తలు సమర్థవంతంగా పని చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు సునీల్ యాదవ్, యోగ్‌రాజ్‌సింగ్ తదితరులున్నారు.

అక్కినేనిని ఆదర్శంగా తీసుకోవాలి



విజయలక్ష్మికి పురస్కారాన్ని అందజేస్తున్న మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: పద్మ విభూషణ్ డాక్టర్ అక్కినేని నాగేశ్వర్ రావ్‌ను నేటి నటీనటులు ఆదర్శంగా తీసుకోవాలని తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆవుల మంజులత తెలిపారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సారిపల్లి కండల్‌రావు సహకారంతో యువకళావాహిణి ఆధ్వర్యంలో అక్కినేని నాగేశ్వరరావు శతజయంతిని పురస్కరించుకుని ప్రముఖ గాయని సి.విజయలక్ష్మి శర్మకు అక్కినేని స్మారక సంగీత పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు సంగీత విభావరి ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగేశ్వరరావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, రచయిత్రి, కేవీ కృష్ణకుమారి, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, యువకళావాహిణి అధ్యక్షులు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాలాభిషేకం



పాలాభిషేకంలో ఎమ్మెల్యే రాజాసింగ్, పాండుయాదవ్, ముక్క కృష్ణగుప్తా తదితరులు

అబిడ్స్: తెలంగాణ రాష్ట్రానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ పసుపుబోర్డు ప్రకటించినందుకు గోల్కొండ జిల్లా కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే రాజాసింగ్, బీజేపీ గోల్కొండ జిల్లా అధ్యక్షుడు పాండుయాదవ్, ఇతర నాయకులు మధుసుదన్‌రెడ్డి, గోవింద్‌రాఠి, రమేష్, అనంత్, రాజేందర్ శర్మ, శశికాంత్ కులర్ణి, స్వరూప్ వ్యాస్, బాలప్రసాద్ మోదీ ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేసి అభినందనలు తెలిపారు.

గుడిమల్కాపూర్‌లో శౌర్య జాగరణ్ ర్యాలీ



గోల్కొండ: విశ్వహిందూ పరిషత్ స్థాపించి 60 ఏళ్లు పూర్తయిన సందర్భంగా విశ్వహిందూ పరిషత్–బజరంగ్‌దళ్ తెలంగాణ ప్రాంతం ఆధ్వర్యంలో ఆదివారం గుడిమల్కాపూర్‌లో శౌర్య జాగరణ్ యాత్ర బైక్ ర్యాలీ జరిగింది. శ్యామ్‌సింగ్ ఆలయం నుంచి కార్వాన్ కన్వీనర్ కృష్ణ ఆధ్వర్యంలో ఈ యాత్ర ప్రారంభమైంది. ఈ సందర్భంగా కార్యక్రమం ప్రతినిధులు కృష్ణ, రక్షిత్ సాగర్ మాట్లాడుతూ.. దేశం కోసం త్యాగాలు చేసింది, హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేస్తుంది విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్‌లే అన్నారు. రఘునాథ్, కార్తీక్, ఈశ్వర్, అనుయాదవ్, యోగ్‌రాజ్‌సింగ్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

చార్మినార్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ చార్మినార్–చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల ఇన్‌చార్జి నర్సింహస్వామి డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగా గద్వాల్ జోగులాంబ జిల్లా అలంపూర్ నుంచి ప్రారంభించిన పాదయాత్రకు పాతబస్తీ నుంచి మద్దతు పలికిన తాము అలంపూర్ సభకు హాజరైనట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, లక్ష్మణ్, బాబురావు, రాకేష్, రఘు తదితరులు పాల్గొన్నారు.



హక్కుల సాధనకు ఎరుకలు ఐక్యంగా ఉండాలి



ఏకలవ్య విగ్రహ స్థాపనకు విరాళంగా చెక్కు అందస్తున్న కురాకుల కృష్ణ

గోల్కొండ: హక్కుల సాధనకు ఎరుకలు ఐక్యంగా ఉండాలని ఎరుకల సంఘం తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ సూచించారు. తెలంగాణలో అన్ని కులాల వారికి ఎన్నో పథకాలు అమలులో ఉన్నాయని, అయితే ఎరుకలకు మాత్రం అన్యాయం జరుగుతుందన్నారు. రాజకీయంగా కూడా ఎరుకలు వెనుకబడే ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఎరుకల సంఘం ఆధ్వర్యంలో ఎరుకలు ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఏకలవ్య విగ్రహాలు స్థాపించడానికి తాము నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఇందులో భాగంగా బాలాపూర్‌లోని మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఏకలవ్య విగ్రహ స్థాపనకు తనవంతు సాయంగా రూ.20 వేలు ఇస్తున్నానని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన చెక్కును ఆయన ఎరుకల సంఘం నాయకుడు శ్రీనివాస్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో రఘు, రాజు తదితరులున్నారు.